క్లుప్తంగా

ఘనంగా మేరీమాత ఉత్సవాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంలో మేరీమాత ఊరేగింపు

నగరి: స్థానిక సెయింట్ మేరీ చర్చిలో మేరీమాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంలో క్రైస్తవులు మేరీమాత ప్రతిమను ఊరేగించారు. ఈ సందర్భంగా బాణసంచా, బ్యాండు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. ఉపన్యాసకులు సెలిస్టియన్ క్రైస్తవులు వెలిగించిన కొవ్వొత్తులను చేతపట్టి ఊరేగింపులో పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను ఏర్పాటు చేశారని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. జాతీయ సేవా పథక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ.. కళాశాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రజలను సమాజసేవపై చైతన్య పరచడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల్లకట్టలేనిదన్నారు. తెలుగు లెక్చరర్ ఉషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్సు అక్తర్ మాట్లాడుతూ.. సమాజాభ్యుదయమే ధ్యేయంగా సేవలందిస్తున్న జాతీయ సేవా పథకాన్ని 1969 సెప్టెంబర్ 24న ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వినీల, తిరుకుమరన్, కౌసర్‌జయాబేగం, ధర్మమూర్తి, సురేశ్ పాల్గొన్నారు.

సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర



ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఐసర్ డైరెక్టర్, ఎన్ఎస్‌యూ వీసీ, అధికారులు

తిరుపతి సిటీ : సమాజ సేవలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కీలక పాత్ర పోషిస్తోందని ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తితో కలిసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ సమాజ సేవకు అంకితం కావాలని సూచించారు. గత ఏడాదిగా విశ్వవిద్యాలయం తరపున ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేసిన సేవా కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ.చందూలాల్, సుజాత పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న డీఎస్పీ భీమారావు

శ్రీకాళహస్తి: మానవసేవే మాధవసేవ అని శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు అన్నారు. పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులు, వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నానని, కానీ ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషాను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు కంతా ఉదయ్, బాబా ఫరీద్, రాజేశ్వరరావు, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణానికి విద్యార్థులు తోడ్పడాలి

వరదయ్యపాళెం: విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని నవభారత నిర్మాణం కోసం పాటుపడాలని వరదయ్యపాళెం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి పిలుపునిచ్చారు. ఆదివారం 55వ జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న నవభారత నిర్మాణానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు జాతీయ సేవా పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఫక్రుద్దీన్, అధ్యాపకులు రవి, షాహుల్, దమయంతి, రాధమ్మ, శశికళ, శాంతకుమారి పాల్గొన్నారు.

పుత్తూరు: నిమజ్జనానికి బయలుదేరిన రామానాయుడు కాలనీ వినాయకుడు, రంగుల చల్లుకుంటూ గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు







మృణ్మయనాథ నమామి

- బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాలు, నృత్యాలతో హోరెత్తించిన యువత
- వైభవంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య

పుత్తూరు రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని ఏడవ రోజైన ఆదివారం సాయంత్రం పుత్తూరు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి నిమజ్జనానికి విగ్రహాలు అట్టహాసంగా బయలుదేరి వెళ్లాయి. ఈ సందర్భంగా మండపాల నుంచి బయలు దేరిన యువత జైజై గణేశా, జైకొడతా గణేశా.. జయములివ్వు బొజ్జ గణేశా అంటూ హోరెత్తించారు. రంగులు చల్లుకుంటూ బాణసంచా పేలుస్తూ, మేళతాళాల మధ్య వైభవంగా ఉత్సవ విగ్రహాలు ఒకదాని వెంక మరొకటి నిమజ్జనానికి బయలుదేరి వెళ్లాయి. ఈ సందర్భంగా ఇంటింటి వద్ద వినాయకుడికి కర్పూర హారతులు ఇచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఇంటింటి వద్ద పంపిణీ చేశారు. పట్టణంలోని రామారావు కాలనీ, ఎంబీరోడ్డు, నగరం రోడ్డు, లక్ష్మీనగర్‌కాలనీ, గేట్‌పుత్తూరు, కాపువీధి, ఆరేటమ్మకాలనీ, ఆర్టీసీకాలనీల్లో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అలాగే నెత్తచెరువు, గోవిందపాళెంచెరువు, నారాయణవనం రోడ్డు చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెరువుల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నగరిలో..

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జనం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఏడు రోజుల పాటు విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించిన స్థానికులు ఆదివారం నిమజ్జనం చేశారు. బాణసంచా వేడుకల నడుమ ఊరేగింపు కోలాహలంగా జరిగింది. యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సత్రవాడ శివార్లలోని నీటి గుంట వద్దకు వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

జయములివ్వు బొజ్జ గణేశా..

పాలసముద్రం: జైజై గణేశా.. జయములివ్వు బొజ్జ గణేశా అంటూ యువత గణనాథున్ని నిమజ్జనానికి తరలించారు. వినాయక చవతి ఏడవ రోజు ఆదివారం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నిమజ్జనం చేశారు. శ్రీకావేరిరాజుపురం దళితవాడలో వినాయక చవతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఏడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ డప్పు వాయిద్యాల నడుమ నిమజ్జనం చేశారు. ఊరేగింపుగా వచ్చిన గణనాథునికి టెంకాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. అనంతరం గ్రామానికి సమీపంలో ఉన్న చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండల కేంద్రం గంగాధరనెల్లూరులోని అల్లిల్లమ్మ దేవస్థానం నుంచి వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అట్టహాసంగా నిమజ్జనం చేశారు. స్వామివారిని ట్రాక్టర్‌పై కూర్చోబెట్టి యువత డప్పులు కొడుతూ, బాణసంచాలు పేలుస్తూ గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో యువకులు రంగులు చల్లుకుంటూ చేసిన నృత్యాలు అలరించాయి.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

శ్రీరంగరాజపురం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. పెద్దతయ్యూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ వరదమ్మ ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలం వేయగా నరేష్, సత్యలత రూ.50,116లకు దక్కించుకున్నారు. అలాగే డప్పు వాయిద్యాల నడుమ యువత గణనాథున్ని ఊరేగింపుగా తీసుకెళ్లి మంచినీళ్లగుంటలో నిమజ్జనం చేశారు.







పుత్తూరులోని లక్ష్మీనగర్ కాలనీ వినాయకుడు, పుత్తూరు: నిమజ్జనానికి ముందు పూజలు, నగరి: నిమజ్జన వేడుకలు నిర్వహిస్తున్న యువకులు

ఓంశక్తి భక్తుల శ్రమదానం



మేళపట్టులో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఓంశక్తి భక్తులు

నగరి: ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం 21వ వార్షికోత్సవం, ఉద్యమ స్థాపకులు శక్తి జీబీ అన్బలగన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పట్టణ పరిధిలో ఓంశక్తి భక్తులు శ్రమదానంతో శుభ్రత పనులు నిర్వహించారు. ఆదివారం ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి వీటీ భాస్కరన్ ఆధ్వర్యంలో కాకవేడు హరిజనవాడ మెయిన్ రోడ్డులో ఉన్న ముళ్లకంపలు, చెత్తకుప్పలను తొలగించారు. అలాగే అడవికొత్తూరు ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మేళపట్టు గ్రామం ఓంశక్తి గుడి ఆవరణలో, ఎలకాటూరు దళితవాడ మార్గంలో ఉన్న చెత్తకుప్పలను తొలగించారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు కమలాకర్, షణ్ముగ రెడ్డి, శేఖర్ రెడ్డి, భాస్కర్, జైప్రకాష్ మహిళలు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో మెడికల్ క్యాంపు రేపు

వెదురుకుప్పం: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పచ్చికాపల్లంలో మంగళవారం దివ్యాంగ పిల్లలకు మెడికల్ అసెస్మెంట్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు అవసరమైన వీల్‌చైర్, రొటావేటర్, వినికిడి యంత్రాలకు సంబంధించి అసెస్మెంట్ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఉన్న దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంపునకు వచ్చే పిల్లలు ఆధార్, రేషన్, సదరం సర్టిఫికెట్, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు





తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు, పిల్లల తల్లిదండ్రులను విచారిస్తున్న ఎఫ్ఎస్ఓ జగదీష్

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలంలోని బంగారురెడ్డి కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం ఆహార భద్రత అధికారి జగదీష్ బృందం తనిఖీలు నిర్వహించింది. కేంద్రంలోని నలుగురు పిల్లలు శనివారం అస్వస్థతకు గురై, తిరుపతి రుయాలో కోలుకుంటున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ముందుగా తిరుపతి రుయాకు వెళ్లి పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆహార భద్రత అధికారులు అక్కడి నుంచి కుప్పంబాదూరు ఆస్పత్రికి వెళ్లి పిల్లలకు ప్రథమ చికిత్స అందించిన మెడికల్ ఆఫీసర్ పూర్ణ నుంచి నివేదిక తీసుకున్నారు. అనంతరం బంగారురెడ్డి కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహార పదార్థాలు, వంటశాల, రికార్డులను పరిశీలించారు. అంతకుముందు గ్రామంలోని పిల్లల తల్లిదండ్రులతో అధికారుల బృందం సంఘటనా వివరాలను సేకరించింది. ఈ సందర్భంగా పుత్తూరు డివిజన్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సేకరించిన నమూనాలను పరీక్షా కేంద్రానికి పంపుతున్నట్లు తెలిపారు. వీరివెంట ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రోజారమణి ఉన్నారు.

మున్సిపల్ ఎంహెచ్‌ఓకు షోకాజ్ నోటీసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్యశాఖ అధికారి(ఎంహెచ్‌ఓ)గా పనిచేస్తున్న డాక్టర్ లోకేష్‌కు కమిషనర్ అరుణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల నగరంలో పిచ్చి కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని, కరుస్తున్నాయంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎంహెచ్‌ఓ పట్టించుకోవడంలేదని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

తిరుమల: శ్రీవారి దర్శనానికి వెళ్తూ ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్‌కు చెందిన నరసప్ప (60) కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనానికి తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం దర్శనానికి వెళుతుండగా గుండెపోటు వచ్చింది. హుటాహుటిన తిరుమలలో ప్రథమ చికిత్స అందించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

2500 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 2500 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు టీటీడీ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆమె ఆదివారం తిరుమల రాంభగీచా-2లోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో 243 మందిని, గరుడసేవ రోజు 774 మందిని అదనంగా ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవనాడు 136 టన్నుల చెత్తను తొలగించామన్నారు. రథోత్సవం నాడు మాడ వీధుల్లో ఇసుకను తొలగించేందుకు అదనంగా 278 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆలయ మాడ వీధుల్లో భక్తులకు తాగునీటిని అందించేందుకు 230 తాగునీటి పాయింట్లు ఉన్నాయని, బ్రహ్మోత్సవాల్లో అదనంగా 187 పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. గరుడ సేవ నాడు 681 మంది శ్రీవారి సేవకులతో భక్తులకు తాగునీరు అందించినట్టు చెప్పారు. కర్నూలులోని రీజనల్ ప్రయోగశాల, తిరుమలలోని టీటీడీ ఆహార ప్రయోగశాల నిపుణులు తిరుమలలోని తాగునీరు, ఆహార నాణ్యతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. హోటళ్లలో ఆహార నాణ్యతకు సంబంధించి భక్తుల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నట్టు చెప్పారు. హోటళ్లలో ధరల పట్టికను ప్రదర్శించేలా సూచిస్తున్నామన్నారు.

ఆరు రోజుల్లో 23,230 మందికి వైద్యసేవలు

బ్రహ్మోత్సవాల ఆరు రోజుల్లో 23,230 మంది భక్తులకు వైద్యసేవలందించినట్టు టీటీడీ ఇన్‌చార్జి సీఎంవో డాక్టర్ నర్మద తెలిపారు. ఆమె ఆదివారం మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ భక్తులకు వైద్య సేవలందించేందుకు తిరుమలలో అశ్విని ఆసుపత్రితోపాటు ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల కోసం అదనంగా 8 ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్విమ్స్, బర్డ్, రుయా ఆసుపత్రుల నుండి 40 మంది డాక్టర్లు, 35 మంది పారామెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. భక్తుల కోసం 24 గంటల పాటు 13 అంబులెన్సులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. గరుడ సేవ నాడు 4800 మందికి వైద్యసేవలందించామని, మాడవీధుల్లో బ్యాటరీ వాహనాల్లో దాదాపు 10 వేల మందికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. చక్రస్నానం రోజు వరాహస్వామి ఆలయం వద్ద వైద్యబృందంతో పాటు అంబులెన్సును అందుబాటులో ఉంచుతామని, నూతన పరకామణి భవనం వద్ద మరో అంబులెన్సు ఉంటుందని తెలిపారు. అశ్విని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి, ఏపీఆర్వో పి.నీలిమ పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న స్వామి వారి తలపాగాలు







కళాకారుల కళా ప్రదర్శనలు





శోభాయమానం.. స్నపన తిరుమంజనం

తిరుమల: రంగురంగుల గాజులు, ఆప్రికాట్ ఫలాలు, వట్టివేరు, కురువేరు, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు అర్చకస్వాములు వేద మంత్రోచ్చరణల మధ్య స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తు, దశ శాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం, వేదాలను పారాయణం చేశారు. తిరుమల పెద్ద జీయంగార్, తిరుమల చిన్న జీయంగార్ వివిధ పాశురాలను పఠించారు. ఈ వేడుకలో రంగురాళ్లతో కూడిన గాజుల మాలలు, ఆప్రికాట్ మాలలు, వట్టివేరుమాలలు, కురువేరుమాలలు, రంగురంగుల రోజామాలలు, పసుపు రోజామాలలు, మిక్సడ్ డ్రైఫ్రూట్స్ మాలలు, తెలుపు ముత్యాల మాలలు, కిరీటాలు, తులసి మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ మాలలను తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన రాజేందర్ విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాదుకు శ్రీహరి, శ్రీధర్, శ్రీనివాస్ విరాళంతో రంగనాయకుల మండపంలో సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్లతో విశేషంగా అలంకరించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, జేఈవో తదితరులు





కళాప్రదర్శనలు



స్వామివారికి అలంకరించేందుకు తెచ్చిన దండలు